
సాక్షి
బాపట్ల
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



తెనాలిలో హిందీ పరీక్షలు

తెనాలి అర్బన్: కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో హిందీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 230 మంది విద్యార్థులు రాశారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,02,082 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 3,18,887 క్యూసెక్కులు వదులుతున్నారు.



లాంచీస్టేషన్ ఆదాయం రూ.78 వేలు

విజయపురిసౌత్: నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. దీంతో స్టేషన్‌కు రూ.78,000 ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జాతీయ రహదారిపై లారీలో మంటలు

దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం



యద్దనపూడి: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న అశోక్ లేలాండ్ మినీ లారీ అగ్ని ప్రమాదానికి గురై పాక్షికంగా దగ్ధమైంది. ఈ ఘటనలో దాదాపు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. సమయానికి అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది, మంటలు పెద్దగా వ్యాపించకుండా వేస్ట్ కాటన్ లోడును కాపాడగలిగారు. చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వేస్ట్ కాటన్ లోడుతో వెళ్తున్న లారీ శనివారం అర్ధరాత్రి దాటాక 2.35 గంటల సమయంలో మండలంలోని వంకాయలపాడు సమీపంలోకి చేరుకుంది. ఇంతలో ఒక్కసారిగా ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీలో మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున వ్యాపించాయి. లారీ డ్రైవర్ కిందకు దూకడంతో ప్రాణనష్టం తప్పింది. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా దాదాపు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే లారీ ఇంజిన్ భాగం పూర్తిగా కాలిపోయింది. ఈ సందర్భంగా చిలకలూరిపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్యాటరీల నుంచి షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే ప్రమాదం సంభవించిందని తెలిపారు. మంటలకు ఆహుతి కాకుండా దాదాపు రూ.10 లక్షల విలువైన వేస్ట్ కాటన్‌ను రక్షించగలిగామని ఆయన పేర్కొన్నారు. ఫైర్ సిబ్బంది ఆర్ మాణిక్యరావు, కె.పవన్‌కుమార్, ఇ.ప్రభాకరరెడ్డి, కె.నరసరాజు పాల్గొన్నారు.

రాచనగరు రహదారులు ఛిద్రం



తాడికొండ: రాజధాని అమరావతికి వెళ్లే ప్రధాన రహదారులు ఛిద్రం అయ్యాయి. అటు ప్రయాణికులు ఇటు వీఐపీలు, వీవీఐపీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు రాజధాని ప్రాంతం ముంపునకు గురైంది. వాగులు ఉప్పొంగాయి. నీరు నిలిచి ప్రధాన రహదారి గుంతల మయంగా తయారైంది. పెదపరిమి నుంచి తుళ్లూరు వరకు ఏర్పడిన భారీ గుంతలు అటు వాహనదారులు, ఇటు నిత్యం రాజధానికి రాకపోకలు సాగించే సచివాలయ, హైకోర్టు ఉద్యోగులు, జడ్జీలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. నెల రోజులుగా ఈ దుస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం గుంతలలో ఫ్లైయాష్ డస్ట్ కూడా వేసిన దాఖలాలు లేని కారణంగా పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రాచనగరుకు వెళ్లే రహదారులకు కనీస మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఐజీని కలిసిన జిల్లా ఎస్పీ



నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠిని ఆదివారం గుంటూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. సమర్థంగా విధులు నిర్వర్తించి, ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని ఐజీ జిల్లా ఎస్పీకి సూచించారు.

పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం 5,009 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి నీటి విడుదల నిలిపివేశారు. బ్యాంక్ కెనాల్‌కు 988 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 342, పశ్చిమ కాలువకు 131, నిజాపట్నం కాలువకు 297, కొమ్మూరు కాలువకు 1,483 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,57,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న పత్రికలపై, ఎడిటర్లపై, రిపోర్టర్లపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణం. సాక్షి దినపత్రిక నిజాలను వెలికి తీస్తోందనే అక్కసుతో కూటమి ప్రభుత్వం దారుణాలకు దిగుతోంది. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై, ఇతర విలేకర్లపై కేసులు నమోదు చేసింది. ప్రభుత్వంపై వ్యతిరేకతను దినపత్రిక ద్వారా ప్రజలకు తెలియజేసిన సాక్షి పత్రికపై అక్కసు వెళ్లగక్కడం మంచి పరిణామం కాదు.

– బొల్లా బ్రహ్మనాయుడు,
మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు



పత్రికా స్వేచ్ఛను హరించడం హేయం



ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభం. సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టి కేసులు నమోదు చేయడం అత్యంత దారుణం. ప్రభుత్వ లోపాలు, ప్రజల సమస్యలను తెలియజేసే క్రమంలో వ్యతిరేక వార్తలు రావడం సహజం. వాటిలో తప్పొప్పులను బేరీజు వేసుకోవాలి తప్పా అక్రమ కేసులు బనాయించడం హేయం. ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు వంటిది. ఇప్పటికైనా కూటమి సర్కారు తీరు మార్చుకోవాలి.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

అక్షరంపై కక్ష సాధింపు తగదు



అక్షరం ప్రశ్నిస్తుంది.. అక్రమం ఎక్కడుంటే అక్కడ గర్జిస్తుంది. ఒక అక్షరాన్ని బహిష్కరిస్తే లక్ష పుట్టుకొస్తాయి. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. కూటమి ప్రభుత్వం దాన్ని కాల రాస్తోంది. సాక్షి మీడియాతో పాటు ఎడిటర్, జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. తప్పులు ఎత్తి చూపుతున్న సాక్షి దినపత్రిక, ఎడిటర్, పాత్రికేయులపై కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. సమాజంలో ప్రతి ఒక్కరూ పత్రికా సేచ్ఛను పరిరక్షించాలి.

–దొంతిరెడ్డి వేమారెడ్డి,
వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త

రైతులందరికీ యూరియా

- విడతలవారీగా పంపిణీకి చర్యలు
- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ భరోసా
- దోమల నివారణ చర్యలకు ఆదేశం
- సూర్యలంక బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన



రైతులకు యూరియా అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కర్లపాలెం: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలోని మార్పు చెన్నాయ్‌వారిపాలెంలో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. తొలుత మన గ్రోమోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. అనంతరం ఎంతమంది రైతులకు పంపిణీ చేశారని వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. సాగు చేసిన రైతులందరికీ కావలసినంత యూరియా విడతలవారీగా అందజేస్తామని చెప్పారు. ఎకరానికి ఎన్నిసార్లు ఎంతెంత మోతాదులో యూరియా వేస్తారని రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు? ఎంత యూరియా అవసరం ? తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించి సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. తమకు మరుగుదొడ్లు కావాలని, తమ గ్రామానికి సాగునీరు, తాగునీరు సక్రమంగా అందటం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో పశువుల పెంపకం ఎక్కువగా ఉన్నందున గోకులం షెడ్లు ఎంతమంది నిర్మించుకున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని ఎంపీడీవో శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో పి.గ్లోరియా వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ, ధన్‌రాజ్, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి

సూర్యలంక బీచ్‌లో జరగనున్న బీచ్ ఫెస్టివల్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యలంకలో ఫెస్టివల్‌కు అవసరమైన పనులను బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మతో కలిసి ఆయన పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ ప్రదేశాలను తిలకించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీఎం శివ పార్వతి, డీఎస్ఓ జలీల్ భాషా, జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో వరద ముప్పు నివారణ

- ప్రాణ నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు



పెసర్లంక అరవింద వారధి వద్ద వరద తీవ్రతను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కొల్లూరు: కృష్ణా నదికి వరదలు సంభవించినట్లయితే ప్రాణనష్టం వాటిల్లకుండా కాపాడే విషయంలో ముందస్తు ప్రణాళికలే కీలకమని జిల్లా కలెక్టర్ వి. వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముంపునకు గురయ్యే గ్రామాలలో సహాయక చర్యలు చేపట్టడానికి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి వరద దిగువకు విడుదల చేసిన అనంతరం జిల్లా పరిధిలోకి ప్రవేశించడానికి పట్టే సమయాన్ని అంచనా వేసుకొని పనులు చేపట్టడం కంటే ముందు జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించుకొని చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది కృష్ణా నదికి 11.42 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో పెను విపత్తు ఏర్పడిన సంఘటనలను గుర్తుంచుకోవాలన్నారు. వరద పెరిగి గ్రామాలను చుట్టుముట్టే ప్రమాదం ఉన్నట్లయితే లంక గ్రామాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సేవలకు అవసరమైన ఏర్పాట్లను విస్తృతపరచాలని కోరారు. వరద తీవ్రతను బట్టి జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బాధిత ప్రజలు ఇబ్బంది ఎదురైతే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించి సురక్షితంగా ఉండాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలను కాపాడాలంటే సమన్వయం ముఖ్యమని చెప్పారు. జిల్లా, డివిజన్, మండల అధికారులు క్రమ పద్ధతిలో ఉన్నత స్థాయి నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తూ విధులు నిర్వహించిన పక్షంలో వరద ప్రమాదం నుంచి ప్రజలను కాపాడగలుగుతామని పేర్కొన్నారు. ప్రతి అధికారి తాము వరద ముంపు బారిన పడితే ఎదురయ్యే ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించుకొని, ఆ కష్టం ప్రజలకు ఎదురవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తు సంభవించకముందే నష్ట తీవ్రతను తగ్గించడానికి ప్రణాళికలతో ముందడుగు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గంజాయి రహితంగా జిల్లా మార్పు

- తీరప్రాంతాల్లో పటిష్టమైన చర్యలు చేపడతాం
- మహిళలు, చిన్నపిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు
- ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం
- జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్
- బాధ్యతలు చేపట్టిన ఎస్పీ



ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.ఉమామహేశ్వర్

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ చెప్పారు. బాపట్ల జిల్లా ఎస్పీగా బి.ఉమామహేశ్వర్ ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ బాధ్యతలు చేపట్టారు. తొలిసారిగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న ఎస్పీకి జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పోలీస్ పరేడ్‌తో ఆహ్వానించారు. బాధ్యతల స్వీకారం అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రజలకు నిష్పక్షపాతమైన సేవలు అందిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. మహిళలకు, చిన్నపిల్లలకు సంబంధించిన నేరాల మీద ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పెండింగ్ కేసుల విచారణలో సాంకేతికతను జోడించి వేగంగా దర్యాప్తు చేస్తామన్నారు. సముద్రతీర ప్రాంతంలో భద్రత చర్యలపై మరింత దృష్టి పెడతామని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా పోలీస్‌స్టేషన్‌కి వచ్చి వారి సమస్యలు చెప్పుకొనే విధంగా చూస్తామన్నారు. మాదక ద్రవ్యాల కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రాబోయే రోజుల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలియపరచడానికి హెల్ప్ లైన్ నెంబర్‌ను ప్రారంభిస్తామన్నారు. జిల్లా ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం పోలీస్ శాఖకు అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు.

పోలీస్ అధికారులతో సమీక్ష

అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుత జిల్లాలోని నేరాలపై సమీక్షించారు. ఇప్పటివరకు నేరాలు జరిగిన తీరు..ఏ తరహా కేసులు ఈ ప్రాంతంలో అధికంగా నమోదవుతుంటాయనే విషయాలపై ఆరా తీశారు. సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ పోలీస్‌శాఖ పేరు ప్రఖ్యాతలు సాధించేలా పనిచేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, చిన్నారులు, మహిళలపై దాడులకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. తీర ప్రాంతంలో గస్తీ మరింత పెంచాలన్నారు. ఎలాంటి సమస్యతో బాధితులు స్టేషన్‌కు వచ్చినా తక్షణమే స్పందించి వారికి సహాయం చేయాలన్నారు. తక్షణమే స్పందించడం ద్వారా నేరాలను ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి.మొయిన్, ఏఆర్ డీఎస్పీ పి. విజయసారథి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో పెరిగిన వరద ప్రవాహం



పెసర్లంక - పెదలంక గ్రామాల మధ్య అరవింద వారధి వద్ద కృష్ణానదిలో నిండుగా ప్రవాహం

కొల్లూరు : కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువ సముద్రంలోకి నీటిని విడుదల చేస్తుండటంతో మండలంలో కృష్ణా నదిలో వరద తీవ్రత పెరిగింది. నది నిండుగా ప్రవహిస్తోంది. ఆదివారం ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.87 లక్షల నీటిని ఆర్‌సీ అధికారులు దిగువకు విడుదల చేశారు. అనంతరం నాలుగు నుంచి ఐదు గంటల వ్యవధిలో జిల్లాలోకి వరద నీటి తాకిడి తగలనుండటంతో గణనీయంగా నదిలో నీటి మట్టం అర్ధరాత్రి అనంతరం పెరిగే సూచనలున్నాయి. తీర ప్రాంత గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు, చిన్నారులు నదిలోకి దిగరాదని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద తీవ్రత అధికమైతే పంటలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళనలో రైతులు ఉన్నారు. ఎగువ ప్రాంతాలో వర్షాలు కురవకుండా ఉంటే నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల తోపాటు మున్నేరు తదితర వాగుల ద్వారా కూడా ప్రకాశం బ్యారేజ్ వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టే సూచనలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 3.50 లక్షల వరకు కృష్ణా నదికి వరద నీటి విడుదల ఉండవచ్చునని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

- మద్యం మత్తులో కారులోని యువకులు
- స్కూటీ, ఆటోలను ఢీకొట్టిన వైనం
- ఆరుగురికి తీవ్ర గాయాలు



కాలువలోకి వెళ్లిన కారు



కారు ఢీకొట్టడంతో బోల్తా పడిన ఆటో

చీరాల అర్బన్: మద్యం మత్తులో ఉన్న యువకులు కారుతో ఆదివారం 216 జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించారు. చిలకలూరిపేటకు చెందిన యువకులు ఆదివారం రామాపురం సముద్రతీరానికి వచ్చారు. మద్యం తాగి సాయంత్రం రామాపురం నుంచి జాతీయ రహదారిపైకి కారులో వేగంగా వచ్చారు. ద్విచక్రవాహనంపై వస్తున్న వేటపాలెం మండలం లక్ష్మీపురానికి చెందిన వ్యక్తిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయారు. అదే వేగంతో హాయ్ రెస్టారెంట్ వద్ద ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ఉన్న రామానగర్‌కు చెందిన ఆరుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కారు వేగ నియంత్రణ కాకపోవడంతో రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు ఆటోలో గాయాలపాలైన యువకులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులకు ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. మద్యం మత్తులో కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగభూషణం తెలిపారు.

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కొనసాగింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్ల క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఘాట్‌రోడ్డు ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులతో ఓం టర్నింగ్ మొదలు, లక్ష్మీ గణపతి విగ్రహం, చిన్న గాలిగోపురం పాయింట్లు కిటకిటలాడాయి. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మరో వైపున మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో రద్దీ మరింత పెరిగింది. మహా నివేదన అనంతరం దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా రెండు గంటల వరకు భక్తులతో క్యూలైన్లు రద్దీ కనిపించాయి. అమ్మవారి దర్శనం అనంతరం మల్లేశ్వర స్వామి వారిని, ఉపాలయాల్లో దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. మహామండపం రెండో అంతస్తులో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ జరిగింది. బఫే పద్ధతిలో అన్నప్రసాదం అందించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లను, హోల్డింగ్ ఏరియాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదివారం పరిశీలించారు. వినాయక టెంపుల్ నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్స్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి బాలబాలికల టీంలు ఎంపిక

బాపట్ల టౌన్: బాపట్ల, నగరం మండలాల్లో ఈనెల 16,17 తేదీల్లో స్కూల్ గేమ్స్ అండర్ 14,17 బాలబాలికల టీంలు ఎంపికలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. బీచ్ వాలీబాల్ పోటీల ఎంపిక బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో, తైక్వాండో పోటీలకు ఎంపిక నగరం మండలంలోని ఉలిపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-14 పోటీలకు విద్యార్థులు 1-1-2012 తర్వాత, అండర్ -17 పోటీలకు విద్యార్థులు 1-1-2009 తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ఎంట్రీ ఫామ్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నికల్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు అనర్హులని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు


గాయపడిన అంజయ్య

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని భవానీ సెంటర్‌లో ఆదివారం జరిగింది. ఎన్టీఆర్ కాలనీకి చెందిన యర్రమోతు అంజయ్య బైకుపై పట్టణంలోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో భవానీ సెంటర్‌లో శింగరకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది బాధితుడిని తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

హెల్త్ పాలసీని వర్తింపజేయాలి



నగరంపాలెం: స్థానిక చుట్టుగుంట కూడలిలోని టుబాకో బోర్డు రైతు భవన్‌లో ఆదివారం భారత పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల వలె హెల్త్ పాలసీ పొగాకు బోర్డులో ఉద్యోగ విరమణ పొందిన వారికి వర్తింపచేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. తద్వారా విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్య ఖర్చులు పొందుతారని అన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వెంకటరావు, మరో ఎనిమిది 75 ఏళ్ల పూర్తైన సందర్భంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు బీఏన్.మిత్ర, సభ్యులు, కర్ణాటక రాష్ట్రం నుంచి హాజరయ్యారు.

పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

- రైతు సంఘం నాయకుల డిమాండ్
- యడ్లపాడులో పత్తి రైతుల సమీక్ష సమావేశం
- అక్టోబర్ 9న నరసరావుపేటలో జిల్లా స్థాయి సదస్సు


పత్తి రైతుల సమస్యలపై చర్చిస్తున్న రైతులు, నాయకులు

యడ్లపాడు: పత్తికి మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో కల్లూరి రామస్వామి అధ్యక్షతన పత్తి రైతుల సమస్యలపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ మాట్లాడుతూ కనీస మద్దతు ధర కన్నా తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనికి పరిష్కారంగా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కి కేటాయించాల్సిన నిధులను తగ్గించడం, చివరకు దాన్ని రద్దు చేసి నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ ఆలోచన రైతులను కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తుందని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.8,110 కాగా, రైతులు కోరుతున్నది మాత్రం సి2+50 ఫార్ములా ప్రకారం క్వింటాల్‌కు రూ.10,075 అని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ లేకపోవడం రైతులకు మరింత నష్టం చేకూరుస్తుందని అన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై విధించే 11 శాతం సుంకాన్ని రద్దు చేయడం వల్ల దేశీయ మార్కెట్‌లో పత్తి ధరలు పడిపోతాయని, ఇది రైతులకు కోలుకోలేని దెబ్బ అని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అక్టోబర్ 9న నరసరావుపేటలో నిర్వహించనున్న పత్తి రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి కల్లూరి రామస్వామి కన్వీనర్‌గా 9 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కల్లూరి రామారావు, శ్రీనివాస రెడ్డి, గోగడ హరిబాబు, నూతలపాటి సుబ్బరామ మూర్తి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్


మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం: శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. ఆదివారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హాలులో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఏదైనా నేరం జరిగితే వెంటనే స్పందించాలని, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, వారి కదలికలు, జీవన విధానంతో పాటు ఏవైనా అనుమానాలు తలెత్తితే తక్షణమే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. పేకాట, కోడి పందేలు, మట్కా, సింగిల్ నంబర్ జూదాలను అరికట్టాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారితో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లలో ఎక్కువసేపు కూర్చోపెట్టొద్దని తెలిపారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జనరల్ డైరీ, రఫ్ డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కేసు డైరీ ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో కానిస్టేబుళ్లకు విధులు కేటాయించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్, కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), రవికుమార్ (ఎల్/ఓ), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట టౌన్: మద్దిరాలలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్‌లో కామర్స్ గ్రూపు ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తరగతి కామర్స్ గ్రూపులో మిగిలిపోయిన 19 సీట్లను ప్రవేశ పరీక్ష లేకుండా భర్తీ చేయనున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యాలయంలో రెండు సంవత్సరాల పాటు ఉచిత విద్య, వసతి, భోజనం వంటి సదుపాయాలను లభిస్తాయని, విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా విద్యను కొనసాగించేందుకు ఇది ఓ సువర్ణ అవకాశం అన్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా వారికే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాకు చెందిన విద్యార్థులైనా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా మద్దిరాల నవోదయ విద్యాలయం ప్రధానాచార్యులను సంప్రదించాలని తెలిపారు.

ఆది ఆచార్యులు బ్రాహ్మణులు


ఉపాధ్యాయునికి సత్కారం

నగరంపాలెం: సమాజంలో గురు పరంపరకు మూలం బ్రాహ్మణం అని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(తిరుపతి) ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి అన్నారు. అందుకే ఆది ఆచార్యుల స్థానం బ్రాహ్మణులకే సొంతమని ఆయన పేర్కొన్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీలోని 13 జిల్లాలకు చెందిన 56 మంది బ్రాహ్మణ జాతికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో సత్కరించి, అవార్డులు అందించారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), శారదాంబ, సమాఖ్య ఉపాధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు, రామభద్రుడు, కసలపాటి లక్ష్మీనారాయణ, పేరి శ్రావణ్, కుప్పం ప్రసాద్, కౌతా ధర్మ సంస్థల అధినేత కౌతా సుబ్బారావు, గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి రంగావఝల లక్ష్మీపతి, పోతావఝల పురుషోత్తమశర్మ, మాగంటి శాస్త్రి పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బాపట్ల అర్బన్: బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బాపట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల సెలక్షన్స్ ఆదివారం జరిగాయి. పోటీల్లో బాలికలు 60 మంది, బాలురు 78 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన బాలురులో 14 మంది, బాలికలో 14 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21వ తేదీ వరకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో క్యాంపులో పాల్గొంటారు. 21న క్యాంపు ముగించుకొని విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. మున్సిపల్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కత్తి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ప్రెసిడెంట్ అర్జున్ రావు, సెక్రెటరీ సుబ్బరాజు, జాయింట్ సెక్రెటరీ మరక సాయికుమార్, ట్రెజరర్ రాధాకృష్ణ, సాప్ కోచ్ శైలజ, పీడీ శ్రావణి, పీడీ మమత, పీడీ లలితమ్మ, పీడీ శాంతికుమారి, బాపట్ల కబడ్డీ క్లబ్ సభ్యులు సాంబశివరావు, నాగులు, నాగేశ్వర రావు, విజయ్, రామాంజిల్‌రెడ్డి, ఊస హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


క్రీడలలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


చీరాల రైల్వే స్టేషన్‌లో మృతుడు


చీరాల-వేటపాలెం మధ్య మృతుడు

చీరాల రూరల్ : స్థానిక రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్-1 ఉత్తరం వైపు చివరన ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్ఐ సీహెచ్. కొండయ్య తెలిపారు. 55 సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ప్లాట్‌ఫాంపై పడున్నాడనే సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. అయితే మరణానికి కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి మరొకరు

రైల్లో ప్రయాణిస్తూ జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చీరాల-వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. విజయవాడ వైపు వెళ్లే డౌన్ మెయిన్ లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో పరీక్షించగా ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ కొండయ్య తెలిపారు. మృతుని వయస్సు 45 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పులిచింతలకు 3,02,629 క్యూసెక్కులు విడుదల


టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి పులిచింతలకు విడుదలైన వరదనీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 15 క్రస్ట్ గేట్లు ద్వారా 3,02,629 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 14 క్రస్ట్ గేట్లు నాలుగు మీటర్లు, ఒక క్రస్ట్‌గేటు 2.5 మీటర్లు ఎత్తు ఎత్తి 3,02,629 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.58 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.462 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 61.83 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

పల్నాడు జిల్లా లైసెన్స్ ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నం


వేణుగోపాలరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా లైసెన్స్ ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఉన్నం వేణుగోపాలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణ శివారులోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నిక నిర్వహించారు. సమావేశంలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల నుంచి ఇంజినీర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ కార్యదర్శి మైనేని లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు నాగ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బొందిలి శ్రీనివాస్, సింగు శ్రీనివాస్, నరసరావుపేట సివిల్ ఇంజినీర్ జీపీ రంగయ్య, యర్రం అనిల్, జున్నా శ్రీనివాసరెడ్డి, ప్లానర్ కోటేశ్వరరావులు పాల్గొన్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు ఉన్నంను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సత్కరించారు.

డ్రెయిన్‌లో పడి బాలుడి మృతి


ఇషాన్ అహ్మద్(ఫైల్)

నకరికల్లు: డ్రెయిన్‌లో పడి రెండేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని కుంకలగుంటలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మస్తాన్‌వలి, ఖైరాబి దంపతుల కుమారుడు షేక్ ఇషాన్‌అహ్మద్(2). రెండురోజులుగా భారీ వర్షం పడుతున్న క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయం తరువాత తల్లీకొడుకు ఇద్దరూ కలసి తమ ఇంటిముందు నిలబడ్డారు. అప్పటి వరకు భారీ వర్షం పడడంతో వారి ఇంటిముందున్న డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుంది. కొడుకును బయట కూర్చోబెట్టిన తల్లి చీపురుకోసం ఇంట్లోకి వెళ్లి వచ్చింది. ఒక్క నిమిషం వ్యవధిలోనే చిన్నారి ఇషాన్ అహ్మద్ కనిపించకపోవడంతో వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్న సమయంలో రెడ్డిపాలెం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఉన్న చిన్నపాటి వాగులో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వర్షంనీటికి ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్‌లో పడడంతో గల్లంతై ఊపిరాడక మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ బాలికల చాంపియన్ గుంటూరు


బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుంటూరు జట్టు

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

బత్తలపల్లి: మండలంలోని రామాపురం జెడ్పీహెచ్ఎస్ మైదానం వేదికగా మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల 10వ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీ చాంపియన్‌షిప్‌ను బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. కాగా, ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో ప్రకాశం జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో తూర్పుగోదావరి, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను ముఖ్యఅతిథులు అందించి, అభినందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోలాటంతో స్థానిక కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ తలారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్రబాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజీ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్పనాయుడు, చిలకం మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పురంశెట్టి రవి, గ్రామ పెద్దలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

కొత్తరెడ్డిపాలెంలో సాధారణ జ్వరాలే..

- డీఎంహెచ్ఓ విజయలక్ష్మి
- స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు


జ్వరంతో బాధపడుతున్న బాలుడి కుటుంబంతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె. విజయలక్ష్మి తెలిపారు. గ్రామంలో ఆదివారం వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రబలిన జ్వరాలు, సాధారణం కంటే కాస్త ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. సీజనల్ జ్వరాల ప్రభావం బలహీనంగా ఉన్న వృద్ధులు, పిల్లలపై ఉంటాయని తెలిపారు. అనారోగ్య సమస్యలున్న వారు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తురకపాలెం బాధితులు మరణించిన వైద్యశాలలో కొత్తరెడ్డిపాలేనికి చెందిన వ్యక్తి మరణించటంతో కలవరం మొదలైందని తెలిపారు. ఇక్కడ జ్వరాల బాధితులంతా సాధారణ మందులతో పూర్తిగా కోలుకున్నారని ఆమె పేర్కొన్నారు. వ్యాధి తీవ్రత అనుమానంతో రక్తపరీక్షలు చేయగా తొమ్మిది మందిలో నలుగురికి నెగిటివ్, ఐదుగురికి జలుబుకు సంబంధించిన స్టైపైలో కోక్కై లక్షణాలు ఉన్నట్లు డాక్టర్లు చెప్పారని వెల్లడించారు. ఇక్కడ సాధారణ జ్వరాలు నమోదైనట్లు తెలిపారు. సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించామని, ఆదివారం రెండు జ్వరాల కేసులు వచ్చాయని చెప్పారు. గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై. ఊర్మిళ, శైలజ, డెప్యూటీ ఎంపీడీవో రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కొండవీడు రాజుల సాహిత్యసేవ మరువలేనిది


ఆవిష్కరణ సభలో అతిథులు

నగరంపాలెం: కొండవీడు రాజుల సాహిత్యసేవ మరువలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఆదివారం కొండవీడు హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో మహాకవి కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలమ్' నాటకానికి కాటయ వేమారెడ్డి రచించిన 'కుమారగిరి రాజీయమ్' వ్యాఖ్యాన గ్రంథ- ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభకు డాక్టర్ డీఎస్ దీక్షిత్ అధ్యక్షత వహించారు. ఈ గ్రంథాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఈ గ్రంథం కొండవీడు రాజుల సాహిత్య ప్రతిభాపాటవానికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కల్లి శివారెడ్డి గణనీయమైన కృషి చేస్తున్నారని అన్నారు. గ్రంథ సంపాదకుడు మోదుగుల రవికృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కల్లి శివారెడ్డి, గ్రంథ ప్రచురణ కోసం సహకరించిన ఆవుల మురళీధర్ రెడ్డి, ఆవుల సుశీల దంపతులు పాల్గొనగా, డాక్టర్ కాజ సుబ్రహ్మణ్యం నిర్వహణలో కొల్లి అక్షయరెడ్డి నాట్య ప్రదర్శన అలరించింది.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం


ప్రసాద్, రాధికలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యభర్తలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన తెనాలి బాలాజీరావుపేటలో ఆదివారం చోటుచేకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రసాద్, రాధిక దంపతులు కొన్నేళ్లుగా తాపీ పనులు చేసుకుంటూ తెనాలి బాలాజీరావుపేట శివారులో ఉంటున్నారు. అపస్మారకస్థితిలో ఉన్న వీరిని స్థానికులు గుర్తించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రాధిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరు ఘర్షణ పడ్డారని, ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారని స్థానికులు చెబుతున్నారు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.